నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

నేడు నిజాంసాగర్ నీటి విడుదల



నవతెలంగాణ-నిజంసాగర్

నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుండి ఖరీఫ్ సాగు అవసరం నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటలకు 1500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నట్టు ప్రాజెక్ట్ ఏఈ శివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరు కూడా కాల్వలో దిగడం గాని స్నానం చేయడం గాని చేయవద్దని ఆయన సూచించారు. ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున రైతులు నీటిని వృథా చెయ్యకుండా జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు. నిజంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.338 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు. నీటి విడుదలకు నేడు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు హాజరుకానున్నారు.

డ్రయినేజీ పక్కన నవజాత శిశువు మృతదేహం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అభం శుభం తెలియని అప్పుడే పుట్టిన రెండు రోజుల ఆడ శిశువు పసికందు మృతదేహం డ్రయినేజీ పక్కన స్థానికులు గుర్తించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాముల బస్తీలో డ్రైనేజీ పక్కన నవజాత శిశువు మృతదేహం కలకలం రేపింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. శిశువు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేను ఉన్నా.. నేనూ ఉంటా

- బాన్సువాడ కాంగ్రెస్‌లో రెండు గ్రూప్‌లు
- పోచారంతో పాటు ఏనుగు రవీందర్‌రెడ్డి
- ఎవరి అభిమానులు వారికే జే జేలు
- నాయకుల వద్దకు పరుగులు పెట్టిన కార్యకర్తలు



నవతెలంగాణ-వర్ని

మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బాన్సువాడ నియోజకవర్గంలో అలజడి నెలకొంది. మాజీ, తాజా కాంగ్రెస్ నాయకులు ఉక్కిరి బిక్కిరి అవుతుండగా, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అభిమానులు ఆనందంతో మరో వైపు స్పీకర్‌ను చేరుకొని అభినందిస్తున్నారు. బాన్సువాడ కేంద్రంలో ఏనుగు రవీందర్‌రెడ్డి అభిమానులు మేము మీతో ఉంటామని ఆయన ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో ఒక కాంగ్రెస్ గూటిలో రెండు గ్రూపులు షురూ అయ్యాయి. మరో వైపు సామాన్య కార్యకర్తలు స్థానిక లీడర్లు తమ పరిస్థితి ఏంటని ఆలోచిస్తున్నారు. రెండు గ్రూపుల మధ్య సామాన్య కర్యకర్తలు నలిగిపోయే అవకాశం ఉంటదని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.

ప్రజలను నమ్మించేది ఎవరు..

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే నాయకులు ఒక్కరు ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజల ఆలోచనలు. కానీ అదే పార్టీ లో ఇద్దరు ప్రధాన నాయకులు ఉంటే ఎవరు ప్రజల తరుపున ఉంటారు. ఎవరు నుంచి న్యాయం జరుగుతుంది అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో గ్రామస్థాయిలో కార్యకర్తలు కొట్టుకొని చస్తారని, గ్రామాలలో భయందోళన స్థితి ఏర్పడుతుందని ముచ్చట్లు. అధిష్టానం ఎప్పటికప్పుడు స్థానిక పరిస్థితులను గమనిస్తూ ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల కోసం ఎవరు అనేది వేచి చూడవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

మీతోనే ఉంటా: ఏనుగు రవీందర్‌రెడ్డి..

శనివారం బాన్సువాడ కేంద్రంలో ఏనుగు రవీందర్ రెడ్డితో అయన అభిమానులు సమావేశం అయ్యారు. అయన అభిమానులకు నేను ఇక్కడే ఉంటా, మీతో ఉంటా, అభివృద్ధి కోసం పని చేస్తా మీరు ఎవరు ఆందోళన చెందవద్దు అంటూ భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడే ఇల్లు కట్టుకొని సైతం ఉంటానని పేర్కొనడం గమనార్హం.

ఎమ్మెల్యేతో అభివృద్ధి అవుతుందా? ఇంచార్జితోనా..?

గతం నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా టికెట్ ఆశించిన వారు కొందరు పోచారం వైపు వెళ్లి సన్మానాలు చేసి మీతో మేము ఉంటామని అంటున్నారు. మరి కొందరు మండల స్థాయి లీడర్‌లు ఏనుగు రవీందర్ రెడ్డిని కలిసి మీతో పాటు ఉంటామని కలుస్తున్నారు. ఎవరు ఎటు పోతారో అనేది తికమకగా మారిందని ఇలా అయితే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుంది అని ప్రజల అనుమానం. ఎమ్మెల్యేతో అభివృద్ధి జరుగుతదా..? లేకుంటే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జితో జరుగుతుందా అని చర్చలు మొదలు అయ్యాయి.

టిఫిన్‌లో బల్లి

- టీయూలోని గర్ల్స్ హాస్టల్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు
- వంట మనిషి సస్పెండ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో గర్ల్స్ హాస్టల్‌లో టిఫిన్ బల్లి వచ్చిన ఘటన శుక్రవారం చోటుచేసుకోగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం యూనివర్సిటీలోని బాలికల హాస్టల్‌లో విద్యార్థులు అల్పాహారం భుజిస్తున్న సమయంలో ఓ విద్యార్థిని ప్లేటులో బల్లి దర్శనం ఇచ్చింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా షాక్‌కు గురయి తోటి విద్యార్థులకు ఈ విషయం తెలుపగ అందోళన వ్యక్తం చేశారు.

వివరాలు మెయిన్‌లో..

భయపడే కాంగ్రెస్‌లోకి పోచారం

- బాన్సువాడలోనే ఉంటా
- అధిష్టానం ఆదేశాలకు గౌరవించాలి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి



వివరాలు మెయిన్‌లో..

ఎంపీ అరవింద్ ఇల్లు ముట్టడి

- విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీఛార్జ్
- ఈడ్చుకుంటూ అరెస్ట్ చేసిన పోలీసులు



ఎంపీ అర్వింద్ ఇంటి ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు



నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, పరీక్ష లీకేజీపై నరేంద్ర మోడీ స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఏబీవీఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ ఇంటిని శనివారం ముట్టడించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి లాఠీచార్జి చేశారు. విద్యార్థి సంఘాల నాయకులను ఈడ్చుకుంటూ తీసు కెళ్లి అరెస్ట్ చేసి 3వ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిం చే నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకై ఫలితాల్లో స్కామ్ జరిగిందని, ఒకే పరీక్ష కేంద్రంలో 8 విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు వ్యక్తం అయితున్నాయని, ఒక్కో పరీక్ష పత్రం లీకేజీలో లక్షల రూపాయలు చేతులు మారాయని, లక్షలాది మంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాట మాడుతుందని ధ్వజమెత్తారు. 67 మందికి ఎలా టాప్ ర్యాంకులు ఎలా వస్తాయని, సుప్రీం కోర్టులో కూడా పలు పిటిషన్లు దాఖలు అయ్యాయని తెలిపారు. నీట్ పరీక్ష ఫలితాలు జూన్ 14న విడుదల చేయాల్సింది ఎన్నికల ఫలితాల రోజే నాలుగున ఎందుకు విడుదల చేశారని వీటన్నిటిని చూస్తే ఫలితాల్లో ఏదో తప్పులు జరిగాయని, కావున సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మోడీ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని , నీట్ పరీక్ష ను మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, విఘ్నేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఆర్ గౌతం కుమార్, ఏబీవీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడ అనిల్ కుమార్, పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏబీవీఎస్‌యూ సాయికుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, డా.గణేష్ .విద్యార్థి సంఘాల నాయకులు ప్రిన్స్, కార్తీక్,సాయినాథ్, పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి

రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- కామారెడ్డి డిసిసిబి బ్యాంకు ముందు ధర్నా, వినతిపత్రం

నవతెలంగాణ-కామారెడ్డి

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. శనివారం తెలంగాణ రైతు సంఘం(ఎఐకెయస్) ఆధ్వర్యంలో కామారెడ్డి డిసిసిబి బ్యాంక్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు రూ.2లక్షల రుణమాఫీని ప్రతి రైతుకు వర్తించే విధంగా వెంటనే రుణ మాఫీ చేయాలని కోరారు. కొత్త రుణాలు ఇవ్వని కారణంగా రైతులు ప్రైవేటు ఫైనాన్స్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకొని ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని వెంటనే అమలు చేస్తూ కొత్త రుణాలు అందరికీ ఇవ్వాలని శోభన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ధరవత్ మోతీరామ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ సావిత్రి, కుమ్మరి సాయిలు, నాయకులు గైని చిన్న సాయిలు, రోజా, రామోల్ల రాములు, మంజుల, సాయవ్వ, స్వప్న, పెద్ద సాయవ్వ ప్రకాష్, వసంత రావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మేయర్
- ఈసారీ మీడియాకు నో ఎంట్రీ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వార్డులలో నెలకొన్ని సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ దండు నీతు కిరణ్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 60 డివిజన్లో ఒక్కొక్క డివిజన్ కి 10 లక్షల రూపాయల అభివద్ధి కార్యక్రమాలు చేపట్టుటకు 6 కోట్ల రూపాయలను అన్ని డివిజన్ లో కలిపి కేటాయించినట్టు తెలిపారు. ఎప్పటిలాగే కార్పొరేటర్లు వారి పరిధిలో ఉన్న సమస్యలను లేవనెత్తడం జరిగిందని వాటిని వీలైనంత తొందరలోనే పరిష్కరించే దిశగా మునిసిపల్ శాఖ పనిచేస్తుందని, అంతేకాకుండా మున్సిపల్ కార్మికులు వేతనాల విషయంలో చర్చించామని అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ మేయర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్నా.. నగరంలో సమస్యలు తీరలే

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్



నిజామాబాదు మున్సిపల్ కార్పొరేషన్ పదవి కాలం ముగిసి కొత్త పాలక వర్గాన్ని ఎన్నుకునే సమయం దగ్గరకు వస్తున్నా మున్సిపల్ సాధించిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. గత 10 ఏళ్ల పరిపాలన మొత్తం అవినీతి, అక్రమాలు, అరాచకాలతో నడిచిందని నిజామాబాదు కార్పొరేషన్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. మున్సిపల్ లో ఒక్క శాఖ అని కాదు అన్ని శాఖల్లో అవినీతి మయమని, శానిటేషన్ నుండి మొదలు పెడితే టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ ఇలా అన్ని శాఖల్లో అవినీతి జరుగుతుందని బడ్జెట్ చుస్తే కోట్ల రూపాయలు కేటాయింపు ఉందని కానీ పనులు జరగట్లేవని అన్నారు. రాబోయేది వర్షాకాలం లోతట్టు ప్రాంతాలు, స్ట్రామ్ వాటర్, గురించి ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారని ప్రశ్నిస్తూ సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ ప్రక్షాళన చేస్తామని, నిజామాబాద్ అర్బన్ అభివృద్ధి తన లక్ష్యం అని, నిజామాబాదును స్మార్ట్ సిటీగా చేయాలనే లక్ష్యం కూడా పెట్టుకున్నామని తెలిపారు.

ఈసారీ మీడియాకు నో ఎంట్రీ..

మున్సిపల్ సమావేశాలలో మీడియాకు అనుమతించాలంటూ గత ఫిబ్రవరి 23న జరిగిన మున్సిపల్ బడ్జెట్ సమావేశాలలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కోరడంతో పాటు ఈ సమావేశాలకు మీడియా అనుమతించుటకై జీఓను రద్దు చేయుటకై ప్రభుత్వాన్ని కోరుతామని తెలిపారు. అయినా తాజాగా శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశాలకు కూడా మీడియా అనుమతించకపోవడంతో, ప్రజలకు ఆర్థిక పరిస్థితులు, అభివద్ధి వంటి కార్యక్రమాలు ఏ విధంగా కొనసాగిస్తున్నారు, ఎంతవరకు ఏ బడ్జెట్ ని కేటాయిస్తున్నారు, ఎటువంటి సమస్యలను కార్పొరేటర్ లేవనెత్తుతున్నారు అనే అంశాలు ప్రజలకు తెలియకుండానే ఉండిపోతున్నాయని పలువురు కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ప్రభుత్వం చేత మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు మీడియాను అనుమతించి విధంగా జీవో ని తీసుకురావాలని, గతంలో ఉన్న జీవో ను రద్దు చేయాలని కార్పొరేటర్లు కోరుతున్నారు.



హాజరైన కార్పొరేటర్లు

అనుమతి లేని నిర్మాణాల్లో వైన్స్‌లు

- చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్న మున్సిపల్, ఎక్సైజ్ అధికారులు
- అధికారుల అండదండలతో యథేచ్ఛగా కొనసాగింపు



మున్సిపల్ భవనం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో మున్సిపల్ అధికారుల పర్మిషన్ లేని రేకుల షెడ్డులలో వైన్ షాపులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. సమాచార హక్కు చట్టంతో ఆ వైన్ షాప్ ల గుట్టు బట్టబయలైంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఏ చిన్న వ్యాపారం చేసిన మున్సిపల్‌కు టాక్స్ కట్టవలసి ఉంటుంది. ఏకంగా రెండు వైన్స్‌లు మున్సిపల్‌కు ఎలాంటి పన్నులు చెల్లించకుండా కొనసాగుతురన్నా మునిసిపల్ అధికారులు కానీ, ఎక్సైజ్ అధికారులు కానీ వాటి వైపు చూసిన పాపాన పోలెదనీ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అతనికి రాజకీయ పలుకుబడి ఉందా ? లేక డబ్బు పలుకుబడితో కొనసాగిస్తున్నాడా అని పలువురు చర్చించుకుంటున్నారు.

వైన్స్ ను ఏర్పాటు చేసే ముందు, వైన్స్ నిర్వహించబోయే ఇంటి నెంబరు, దుకాణ యజమాని అంటే యజమానితో అగ్రిమెంటు తదితర పేపర్లను, మున్సిపల్‌లో అనుమతులు తీసుకున్న రసీదులను గమనించిన తర్వాతనే ఎక్సైజ్ అధికారులు వైన్స్ కు పరిమిషన్ ఇస్తారు. అలాంటిది మున్సిపల్ లో ఎలాంటి అనుమతులు లేని రేకుల షెడ్డులో కొనసాగుతున్నా ఈ వైన్స్‌లకు ఎలా పరిమిషన్ ఇచ్చారో ఎవరికి ఎంత పట్టడం లేదు.

సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి..

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రైల్వే గేట్ వద్ద గల శ్రీ సాయి వైన్స్, సిరిసిల్ల రోడ్లో గల తేజా లిక్కర్ మార్టకు మున్సిపల్ నుండి పర్మిషన్ ఉందా లేదా అనే అనుమానం వచ్చి ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద మున్సిపల్‌లో సమాచారాన్ని కోరగా లేఖ నెంబర్ 609/2024, ద్వారా సమాచార హక్కు చట్టం ద్వారా వివరణ కోరాడు. శ్రీ సాయి వైన్స్ రైల్వే గేట్ కి ఆపోజిట్, తేజ లిక్కర్ మార్ట్ సిరిసిల్ల రోడ్డు వైన్స్‌లు కొనసాగుతున్న షెడ్లలకు అనుమతులు ఇచ్చారా, ఇచ్చినట్లయితే వాటికి సంబంధించిన అనుమతి కాపీలను ఇవ్వగలరని, ఇవ్వనట్లయితే వాటిపై ఇప్పటివరకు మీరు తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను తెలుపగలరని ఆ వ్యక్తి కోరారు. కాగా అనుమతులకు సంబంధించిన సమాచారం లేదని తెలపడం గమనార్హం.

మార్కెట్‌లో కూరగాయల గంపకు డబ్బులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు రెండు వైన్స్‌లకు మున్సిపల్ నుంచి ఎలాంటి పన్నులు చెల్లించకుండానే కొనసాగుతున్నా. ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా ఉంటున్నారని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

పేదలపై ప్రతాపం, పెద్దలపై ప్రేమ..?

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో అధికారులు తమ ఇష్టారీతిగా వ్యవహరస్తున్న తీరు మరోసారి బయటపడింది. మున్సపల్ అధికారులు పేదలపై చూపే ప్రతాపం, పెద్దలపై ఎందుకు చూపెట్టలేకపోతున్నారని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో సీజనల్ కాలాలలో రోడ్లపై వివిధ వ్యాపారాలు నిర్వహించుకునే చిరు వ్యాపారస్తుల వద్ద వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్న మునిసిపల్ అధికారులు, జిల్లా కేంద్రంలో రోజుకు వేల రూపాయలు వ్యాపారం జరిగే ఈ వైన్స్‌మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి అనుమతులు లేకపోతే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

నీటి సమస్యకు వెంటనే పరిష్కారం


నీటి సమస్యను పరిష్కరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో నీటి సమస్య ఉందని అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే అధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ చంద్రకాంత్, స్పెషల్ ఆఫీసర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఐకెపి సిబ్బంది


తాళం వేసి ఉన్న ఐకెపి కార్యాలయం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 10:30 గంటలైనా కార్యాలయ తాళాలను తీయలేదు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వల్లే కార్యాలయానికి నిరంతరం తాళం ఉంటుందని, ఇకనైనా సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు


మంత్రిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను బాల్కొండ బిజెపి నాయకులు కరీంనగర్‌లో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో బాల్కొండ నియోజకవర్గ నాయకులు రూయ్యడి రాజేశ్వర్, జిల్లా కార్యదర్శి నాగులపల్లి రాజేశ్వర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగారెడ్డి, యువమోర్చా జిల్లా కార్యదర్శి అనూప్ కుమార్ తదితరులున్నారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో


తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా పరిషత్ సీఈవో ఉషా శనివారం సందర్శించారు. మండల పరిషత్‌కు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, కార్యాలయానికి వచ్చేవారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. రికార్డులు పెండింగ్ లేకుండా చూడాలని ఆమె స్పష్టం చేశారు. ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న శివప్రసాద్

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్, ఊట్పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు (ఎల్.ఎఫ్.ఎల్.) శివప్రసాద్ రిటైర్మెంట్ అయిన సందర్భంగా శనివారం అందాపూర్, ఊట్పల్లి ప్రాథమిక పాఠశాల 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి, తల్లితండ్రులకు, పాఠశాలకు మంచిపేరుతో పాటు ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సూర్యకుమార్, ప్రధానోపాధ్యాయులు ధనరాజ్, అందాపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఊటపల్లి క్రిష్ణ గుప్తా, ఉపాధ్యాయులు ఉమారాధ, సంగమణి, పాపారావు, శివకుమారి, వాసవి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ టీచర్లకు ఘన సన్మానం


అంగన్‌వాడీ టీచర్లను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ప ట్టణం పాం డుఫారం అంగన్వాడీ కేంద్రం టీచర్ కృష్ణవేణి, సాలూర మండలం కుమ్మ న్‌పల్లి గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ గంగామణి శనివారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆచన్‌పల్లి సెక్టార్‌లో వారిని ఐసిడిఎస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా పూలమాలలతో సూపర్వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతూ, ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్లు చిన్నారులకు ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. వారి వ్యక్తిగత కారణాల ద్వారా అంగన్వాడీ టీచర్ ఉద్యోగానికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారని అన్నారు. భవిష్యత్తులో ఆయురారోగ్యాలతో తమ కుటుంబ సభ్యులతో కలిసి జీవించాలని సూపర్వైజర్ సౌజన్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రేణుక, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, భాగ్య, సరిత, రాధిక, సలీమా, మహమ్మదితో పాటు సెక్టర్ అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

శుభ్రతతో రోగాలు దూరం

- ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్
- కీటక జనిత వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్

నవతెలంగాణ-కోటగిరి

శుభ్రతతో రోగాలు దరిచేరబోవని ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న మలేరియా మాసం సందర్భంగా లార్వా సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిలువ ఉన్నటువంటి నీటిని తొలగించాలన్నారు. 16, 17వ వార్డుల్లో గుర్తించిన లార్వా తొలగించి ప్రజలకు, యువకులకు జాతీయ కీటక జనిత వ్యాధుల పైన అవాగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి రోజు కాచి చల్లార్చిన నీరు సేవించాలని, వేడి వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆహారం తినేటప్పుడు చేతుల పరిశుభ్రత పాటించాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఇంటి ఆవరణలో పగిలిన డబ్బాలు, కుండీలో నీరు నిలువకుండా చూడాలని, నీటి నిలువ గుంటలు తొలగించుకోవాలని చెప్పారు. మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపైన అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఇక్కడ నేర్పిన అవగాహనా కలిగించిన విషయాలు ఇంటిలో కుటుంబ సభ్యులకు, తల్లిదండ్రులకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు రోజా, శ్రీదేవి, మంజుల, ఆశాలు సుజాత, స్వప్న, అనురాధ, అక్తరి, స్వప్న, గంగామణి, అనిత పాల్గొన్నారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయ సిబ్బంది, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గల అంగన్వాడి కేంద్రాన్ని ఐసిడిఎస్ పిడి రసూల్ బి శనివారం సందర్శించారు. అక్కడ అంగన్వాడి ఉపాధ్యాయురాలు పోస్ట్ ఖాళీగా ఉండటంతో అంగన్వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆయాతో కేంద్రం కొనసాగుతోంది. మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారి బాలబాలికలు సుమారు 15 మంది ఉంటారు. ఆయా పిల్లల బాగోగులు చూస్తూ వారికి పౌష్టికాహారాన్ని అందజేస్తుంది. కానీ కేంద్రానికి వచ్చే పిల్లలు పూర్వ ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. దీంతో ఐసిడిఎస్ పిడి రసూల్ బి మండలంలోని దుబ్బ తాండ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు శారదకు ఇంచార్జి బాధ్యతలను అప్పజెప్పారు. దుబ్బ తండా అంగన్వాడి ఉపాధ్యాయురాలు, గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని నడిపిస్తూ చిన్నారి బాలబాలికలకు విద్య బోధన చేస్తూ పౌష్టికాహారాని అందిస్తూ, రికార్డులను మెయింటెనెన్స్ చేస్తున్నారు. దుబ్బ తండ అంగన్వాడి ఉపాధ్యాయులు శారదకు రెండు కేంద్రాలు నిర్వహించేందుకు ఇబ్బందిగా మారడంతో బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మహిళ ప్రమీలను తాత్కాలిక ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించాలని సూచి ంచారు. ప్రమీలకు గ్రామాభివృద్ధి కమిటీ లేదా గ్రామస్తులు ద్వారా నెలకు రూ.3వేలు గౌరవ వేతనం అందజేస్తామని గ్రామస్తులు ముందుకు వచ్చారు. సమావేశంలో ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ సిడిపిఓ జానకి, ఎడపల్లి మండల సూపర్వైజర్ విజయరాణి, ఇంచార్జి అంగన్వాడీ ఉపాధ్యాయురాలు శారద, ఏఆర్‌పి క్యాంప్ అంగన్వాడి కేంద్రం ఉపాధ్యాయురాలు సుజాత, ఆశావర్కర్ స్వరూప, మాజీ సర్పంచ్ అంగపట్నం లక్ష్మీ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కార్

- సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

లీకేజీలు, ప్యాకేజీలతో మోడీ సర్కార్ విద్యావిధానాన్ని నిర్వీర్యం చేస్తున్నదని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ తీవ్రంగా విమర్శించారు. శనివారం ధర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోడీ మొత్తం అన్ని రంగాల్ని నిర్వీర్యం చేస్తున్నాడని అందుకే విద్యారంగాన్ని కూడా అస్తవ్యస్తం చేసి బొంద పెట్టడానికి కుట్ర పన్నుతున్నాడని అన్నారు. హిందూ కాషాయికరణ పేరుతో విద్యార్థులను అజ్ఞానులను చేస్తున్నారని తెలిపారు. ఒకవైపు విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులను కోత పెడుతూ మరోవైపు లీకేజీలతో గ్రామీణ విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నాడని దుయ్యబట్టారు. అనంతరం రాష్ట్ర నాయకులు అనిల్ మాట్లాడుతూ.. కేంద్రం నిస్సిగ్గుగా విద్యార్థులను బలిపశువులను చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆశిష్ అధ్యక్షత వహించగా.. మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్, జిల్లా నాయకురాలు మమత, విద్యార్థులు నరేష్, చరణ్, నవీన్, సందీప్, విక్రం, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ 2018 కటాఫ్ తేదీతో నష్టం కలిగే అవకాశం


- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య



నవతెలంగాణ-ధర్పల్లి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగానికి చేయనున్న రుణమాఫీ పథకం అనేది 2018కి కటాఫ్ తేదీ పెట్టడం వల్ల రాష్ట్రంలోని పేద మధ్యతరగతికి చెందిన చిన్న సన్నకారు రైతులతోపాటు రాష్ట్రంలోని గిరిజన, ఆదివాసీలకు నష్టం జరిగే అవకాశం ఉందని అలాగే రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికమనేది ప్రభుత్వం పునరాలోచన చేయవలసిందిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్య కోరారు. శనివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలోని అసైన్డ్ భూములకు పట్టాలు అందించక ఇబ్బందులు ఎదుర్కుంటున్న రైతులకు మోసం చేశాడని, అలాగే రాష్ట్ర ప్రజలకు రేషన్ కార్డులు జారీచేయకుండా ప్రజలకు మభ్యపెట్టే పనిలోనే కలం వెళ్లదీశారని తెలిపారు. లక్ష రుణమాఫీ చేస్తానని అదికూడా చేయకుండా రైతంగాన్ని మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్రంలోని ఆయా జిల్లాల జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులతో క్షేత్ర స్థాయిలోని అంశాలను పరిగణలోకి తీసుకుని రుణమాఫీపై పునరాలోచన చేయాలని కోరారు. దీంతో పాటు అసైన్డ్ భూములకు పట్టాలతోపాటు, రాష్ట్రప్రజలకు త్వరలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.


డిగ్రీ విద్యార్థి అదృశ్యం



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఇంట్లో నుంచి బయటకు వెళ్ళిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం పెద్దకొడప్ గల్ గ్రామానికి చెందిన బత్తిని హరికుమార్(19) బిచ్కుంద ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బయటకు వెళ్ళి వస్తానని బైక్‌పై జూన్ 9వ తేదీన ఇంటి నుంచి బయలు దేరి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇతర చోట్ల వెతికిన ఆచూకి లభించలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్ళే సమయంలో నీలి, పసుపు రంగు కలిగిన చొక్కను, నీలి రంగు జీను ప్యాంటును ధరించాడు. యువకుడి తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి పేర్కొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో అల్బండజోల్ మాత్రలను విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మీనాజ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

- ఆర్టీవోకు వినతిపత్రం అందజేత


ఆర్టీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఫిటెనెస్ లేని బస్సులను సీజ్ చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఇన్చార్జి అఖిల్ ఆధ్వర్యంలో ఆర్టీఓ వివేకానంద రెడ్డి కి శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్ బస్సుల్లో ఫిట్నెస్ బస్ కండిషన్ ఉండాలని అలాగే డ్రైవర్‌కి డ్రైవింగ్ లైసెన్స్, బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, వర్ధన్, సాయి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఉషశ్రీ, రెయిన్బో పాఠశాలలో చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలో గెలుపొందిన విజేతలకు గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాలను శనివారం అందజేసినట్టు కరస్పాండెంట్ రాజేశ్వర్ గౌడ్, ప్రిన్సిపాల్ నసిర్ పేర్కొన్నారు. చిన్నారుల సృజనాత్మకతను వెలుగు తీయడానికి ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నట్టు మేనేజర్ రాజేష్, సాయిలు తెలిపారు. విజేతలకు ప్రశంస పత్రాలతో పాటు గోల్డ్ మెడల్స్ అందజేశారు.

రేపు ఆదర్శ పాఠశాల మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

- ప్రిన్సిపాల్ బలరాం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి, పదవ తరగతి ప్రవేశానికి ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మెరిట్ ప్రకారం వారిని తీసుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీసీ, బైపిసి, సీఈసీలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్టు వివరించారు. ఆసక్తి గలవారు సోమవారం బోనఫైడ్, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఉదయం 10 గంటలకు ఆదర్శ పాఠశాలలో హాజరుకావాలని సూచించారు.

హరిసింగ్ నాయక్ తాండ వాసులకు కాంగ్రెస్ నాయకుల బాసట


భూమి పూజ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో హరిసింగ్ నాయక్ తండాలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆలోచించి కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంత డబ్బులతో మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించడానికి పూనుకున్నారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మినీ వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వమే కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సొంతగా ప్రజలకు సేవ చేయడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా దేవక్కపేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను మానాల మోహన్‌రెడ్డి అభినందించారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అందరూ ప్రజలకు కావాల్సిన పనులను చేయాలని కోరారు. అదేవిధంగా మినివాటర్ ట్యాంక్ నిర్మాణంలో పాలుపంచుకున్న డిసిసిబి చైర్మన్ రమేష్‌రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ అరికెళ్ల సాయిలు, మండల జనరల్ సెక్రెటరీ మాలావత్ రవి, శ్రావణ్, మాజీ గ్రామ అధ్యక్షుడు బొట్ల నరసయ్య, బాణావత్ రవి, మోహన్, అరికిల్ల సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

డివి కృష్ణ వర్ధంతి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఐఎంఎల్ నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఆచరణాత్మక ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త భారత విప్లవోద్యమ నాయకులు డివి కృష్ణ అని సిపిఐఎంఎల్ మాస్ లైన్ నాయకులు స్పష్టం చేశారు. శనివారం మండల ంలోని బోర్గాం గ్రామంలో డీవీ కృష్ణ వర్ధంతి పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణ ఉద్యోగాన్ని వదిలి విప్లవ ఉద్యమాన్ని ఊపిరి పోసిన మహా నాయకుడని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుట్టి నడిపి నాగన్న, పార్వతి రాజేశ్వర్, ఎస్కే నసీర్, వడ్డెన్న పెద్దులు, మన్నె పోశెట్టి, మక్కన్న, సిద్ధ పోశెట్టి, చాకలి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీపీ గాల్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పనులలో నాణ్యత పాటించి త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో బోరు ఇంకిపోవడం వలన తాగునీటి సమస్యను గుర్తించి దగ్గరలో ఉన్న సింగిల్ ఫేస్ మోటర్ నుంచి కనెక్షన్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ సోహెల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బాబు తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పార్క్‌లు ఆహ్లాదం పంచాలి

నవతెలంగాణ-కామారెడ్డి

పార్క్‌లు పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందు ప్రియ సూచించారు. కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్‌లో గల రాజీవ్ పార్క్‌ను శనివారం సందర్శించారు. పార్క్ నిర్మాణం ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. పార్కుకు వచ్చే పర్యాటకులకు, పట్టణవాసులకు ఆహ్లాదకరంగా మంచి వాతావరణన్ని కల్పించాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో, మున్సిపల్ కమిషనర్ సుజాత, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


పార్క్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఏకకాలంలో రైతు రుణమాఫీ హర్షణీయం

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన రైతులు, నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/లింగంపేట్/సదాశివనగర్

రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటన పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

రాష్ట్రంలోని రైతులకు ఏక కాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీబీపేట్ మండల రైతుబంధు సమితి అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయాన్ని పండగ చేయడమే కాంగ్రెస్ విధానమని వ్యవసాయాన్ని దండగా కాకుండా పండుగ చేయాలనే లక్ష్యంతో 2022 మే 6న వరంగల్ సభలో రైతు డిక్లేరేషన్ రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలను ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయాలని నిర్ణయించడంతో రైతు రుణమాఫీ పై కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అమలుకు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామ మన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గత పదేళ్లలో నాలుగు విడుతల్లో రుణమాఫి చేస్తామని చెప్పి రైతులకు పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదన్నారు. ప్రభుత్వం గతంలోనే ప్రకటించినట్లుగా ఆగస్టు 15వ తేదీ లోగానే రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తోందనడానికి ఇదే నిదర్శనమన్నారు.



లింగంపేట్‌లో, సదాశివనగర్ మండల కేంద్రాల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

లింగంపేట్ : లింగంపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకేసారి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని అందుకు రైతుల రుణ మాఫీ నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, మండల యూత్ అధ్యక్షులు సుప్పాల రాజు, మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి, నాగరాజు, పోచయ్య, మండల కాంగ్రెస్ నాయ కులు పతియొద్దీన్, డాక్టర్ రాజు, జక్సాని రవి, ప్రసాద్ గౌడ్, కౌడ రవి, దురిశెట్టి అశోక్ నహీం పరంధాములు పాల్గొన్నారు.

సదాశివనగర్ : సదాశివనగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, వైస్ ఎంపిపి గాదారి శ్రీనివాస్‌రెడ్డి, వీరితో పాటు ఆయ గ్రామ ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో.. మానసిక, శారీరక ప్రశాంతత

- జిల్లా అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కే. నరసింహారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రపంచ పదవ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక జిల్లా పోలీసు మైదానంలో ఏర్పాటుచేసిన యోగా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ కే. నరసింహారెడ్డి పాల్గొని సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. మొదటగా యోగా శిక్షకులు సంగీత ప్రవీణ్, ఉమేష్ యోగను సిబ్బందికి తెలియజేస్తూ, సూర్య నమస్కారాలు, ప్రాణాయామము, ఆసనములు సిబ్బంది ద్వారా చేయించరు. యోగా దినోత్సవం లో భాగంగా జిల్లా అడిషనల్ ఎస్పీ, డిఎస్పి తో సహా సిబ్బంది వివిధ రకాల సూర్య నమస్కారాలు, ఆసనములు, వివిధ రకాల ప్రాణాయాములు స్వయంగా చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశిస్తూ జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ మొదటగా సిబ్బందికి పదవ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశంలో యోగా పుట్టడం మన అందరి అదృష్టంగా పేర్కొన్నారు. అందరూ ప్రతి రోజు యోగ ప్రాణాయం చేయాలన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు కార్యాలయాల్లో సిబ్బంది యోగా దినోత్సవం నిర్వహించుకున్నట్టు తెలిపారు. యోగ శిక్షణ గురువులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ యకూబురెడ్డి , సీఐలు చంద్రశేఖర్రెడ్డి, రామన్, మురళి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శేఖర్, కృష్ణ , ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న అడిషనల్ ఎస్పీ

ఎవరూ అధైర్య పడొద్దు

- మన వెంట కేసీఆర్ ఉన్నారు
- మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే


ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజాంసాగర్

ఎవరు అధైర్య పడొద్దు.. మన వెంట కేసీఆర్ ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే అన్నాడు. శనివారం మండలంలోని మల్లూరు గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న గొల్ల వీరప్ప, కోటగిరి రవి ప్రమాదవశాత్తు మరణించినారు. మరణించిన వారికి పార్టీ సభ్యత్వం ఉన్నందున పార్టీ ఇన్సూరెన్స్ వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రాలో చంద్రబాబు పూర్తి అసెంబ్లీ స్థానాలతో ఎలా అయితే అధికారంలోకి వచ్చాడో మన పార్టీ కూడా ముందు ముందు రెట్టింపు వేగంతో అలాగే అధికారంలోకి రాబోతుందని ఆయన తెలిపారు. పార్టీని నమ్ముకున్న వాళ్ళకి అన్ని విధాల అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ధఫెదర్ రాజు, మండల సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, మల్లూరు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కళ్యాణి విఠల్ రెడ్డి, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా నీటీ కులాయిల సర్వే


ఇంటింటి భగీరథ సర్వే చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం గ్రామ కార్యదర్శి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా నీటి కులాయీల సర్వే నిర్వహించినట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశానుసారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటి ఇంటింటికి తిరిగి మిషన్ భగీరథ కులాయి కనెక్షన్లు ఉన్నాయా లేవా వివరాల అడిగి తెలుసుకున్నారు. లేనివారి వివరాలు నమోదు చేసుకున్నారు. కులాయి ఉండి కూడా నీటి వసతి లేకపోవడంతో అందుగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగు రోజుల నుండి సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ బట్టు సాయిలు మునీ ర్ సిబ్బంది ఉన్నారు.

వృద్ధురాలికి రక్తం అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సదాశివనగర్ మండలం మల్లుపేట్ గ్రామానికి చెందిన బాలవ్వకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఈ విషయాన్ని సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ జానకిరామ్‌కు తెలియజేయడంతో వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. నేటి సమాజంలో రక్తదానం పట్ల అపోహలు ఉండడం జరిగిందని రక్తదానం వల్ల ఎలాంటి నష్టాలు రక్తదానం చేసే వారికి ఉండవని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాత జానకిరాముకు ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్నల తరఫున అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు జమీల్, టెక్నీషియన్ నూర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

ప్రజాసంక్షేమం గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. శనివారం మండలంలోని దన్నూర్ గ్రామంలో ఐదు లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిదాస్ పటేల్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యాదవ్‌పటేల్, విట్టల్‌రావు పటేల్, మనోహర్ దేశాయ్, సంగమేశ్వర్, గ్రామ పెద్దలు, మహిళలు, పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఏరువాక పౌర్ణిమ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఈ ఏడాది సమృద్ధిగా విస్తారమైన వర్షాలతో పుష్కలమైన పాడిపంటలతో రైతన్నలందరూ బాగుండాలని వర్షాలతో నదులు నుండి పంట భూములు సిరుల పంటలు పండాలని ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు ఆకాంక్షించారు. రైతన్నల ఇంట పండుగ వాతావరణం వెల్లి విరియాలని ఆకాంక్షిస్తూ జుక్కల్ నియోజకవర్గం రైతన్నలందరికీ శనివారం ఒక ప్రకటనలో ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

జులై 1న చలో రవీంద్రభారతి

- జాతీయ బంజారా సమ్మేళన సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి

లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జాతీయ బంజారా సమ్మేళన సదస్సు నిర్వహించనున్నట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ బంజారా సమ్మేళనం లంబాడి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బెల్లయ్య నాయక్ హాజరవుతారని వెల్లడించారు.

లంబాడ హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నునావత్ గణేష్ నాయక్ , కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రాణా ప్రతాప్ రాథోడ్ కామారెడ్డి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 'మా తండాలో మా రాజ్యం' అనే నినాదంతో మేము ఎంత మందిమో మాకు అంత వాటా అనే నినాదంతో 1997 జులై 1 ఒకటవ తారీఖున ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నందు లంబాడి హక్కుల పోరాట సమితి (యల్. యచ్. పి. యస్) అనే సంఘం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సంఘం ఏర్పడి నేటికీ 28 సంవత్సరాలు అవుతున్నదని, సంఘము ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ బంజార జాతి సంఘాల ప్రతినిధులతో హైదరబాద్ నగరంలో జరిగే జాతీయ బంజారాసమ్మేళనం సమావేశము ఉంటుందని , ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి లంబాడి మేధావులు పెద్దలు, విద్యార్థులు అందరూ కదిలి రావాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క , రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ పాల్గొంటారన్నారు. సమావేశంలో జివిఎస్ జిల్లా నాయకులు ఆనంద్‌రావు నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నునావత్ శ్రీనివాస్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ధన్ సింగ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

విప్లవోద్యమ నేత కామ్రేడ్ డీవి కృష్ణ

- వర్ధంతి కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-రామారెడ్డి

ఆచరణాత్మక ప్రజాపంథ సిద్ధాంత రూపకర్త, భారత విప్లవోద్యమ నేత కామ్రేడ్ డివి కృష్ణ విప్లవ కారులకు ఆదర్శమని సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డివి కృష్ణ స్మారక స్తూపం ఆవిష్కరణ, వర్ధంతి కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కామ్రేడ్ డివి కృష్ణ ఉద్యోగాన్ని వదిలి విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. సమకాలీన పరిస్థితులకు అనుకూలంగా విప్లవ పార్టీలు తమను సైద్ధాంతికంగా తీర్చి దిద్దు కోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పిన గొప్ప నేత అని అన్నారు. నేటి విప్లవ తరానికి కామ్రేడ్ డివి కృష్ణ మార్గదర్శకుడు అని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రెండవ వర్ధంతి తో పాటు, స్మారక స్తూపం ఆవిష్కరణ జూన్ 26న ఉన్నందున విప్లవ కారులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ రమేష్, జి సురేష్, కిషోర్, దామోదర్, ఎస్ కిషోర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న నాయకులు

హనుమంతు షిండే దారెటో..?

- జుక్కల్ నియోజకవర్గంలో మొదలైన చర్చలు

నవతెలంగాణ-మద్నూర్

బీఆర్ఎస్ పార్టీ అధినేత రెండుసార్లు అధికారాన్ని చేపడుతూ తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో కేసీఆర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని లక్ష్మీ పుత్రుడుగా భావించేవారు. అలాంటి లక్ష్మీ పుత్రుడు కెసిఆర్ పార్టీని వదిలి కాంగ్రెస్‌లో చేరారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో పోచారం శిష్యుడు జుక్కల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే అనుమంతు షిండే దారెటో అనే చర్చలు మొదలయ్యాయి. గురువే లేనప్పుడు శిష్యుడు ఏమి చేయగలడనే చర్చలు నియోజకవర్గ ప్రజల్లో జోరుగా వినిపిస్తున్నాయి. పోచారం ముఖ్య శిష్యుడైన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండేను కూడా కాంగ్రెస్ వైపు మలుపు కుంటారేమోనని చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. షిండే కూడా పార్టీ మారుతారా లేక బీఆర్ఎస్ పార్టీకి కట్టుబడి ఉంటారా ప్రజల్లో చర్చలు మొదలయ్యాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగయ్యే దిశలో కనబడుతుంది. ఎందుకంటే ఆ పార్టీలోని అతి ముఖ్యమైన నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లడం ఆ పార్టీకి మనుగడ లేక పోతుంది. గెలిచిన ఎమ్మెల్యేలు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎమ్మెల్యేలే వెళ్లిపోతుంటే ఇక మాజీ ఎమ్మెల్యేలు పార్టీకి కట్టుబడి ఎలా పనిచేస్తారనేది చర్చనీయాం శంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో హనుమంతు షిండే పార్టీ మారి గురువు వెంట వెళ్తారా లేక తల్లి లాంటి పార్టీని వదలకుండా కట్టుబడి బీఆర్ఎస్ పార్టీకి బలోపేతం చేస్తారా నియోజకవర్గ ప్రజల్లో జోరుగా చర్చలు వినిపిస్తున్నాయి.


మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

పౌష్టికాహారం అందించాలి

- మైనారిటీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని మైనారిటీ బాలికల వసతి గృహాన్ని శనివారం ఇంచార్జ్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్ సందర్శించారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినిలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విద్యార్థినిలు తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రణీత, అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

ఎర్రకుంట తండాలో పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని ఎర్ర కుంట తండాలో గల ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంపీపీ టేకులపల్లి వినీత దుర్గారెడ్డి, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల సంఖ్య ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఇవ్వాలని ఆదేశించారు. వారి వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



గిద్ద పాఠశాలలో నో బ్యాగ్ డే

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గిద్ద ఉన్నంత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, పాటల పోటీ, ఖో ఖో ఆటలను నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు కన్నయ్య మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు పాటలు, ఆటలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమేష్, విష్ణు, కాసిం, కైలాస్, స్వప్న ప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహేష్, రాజేశ్వర్, సి ఆర్ పి మహమ్మద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


బ్యాగులు లేకుండా వచ్చిన విద్యార్థులు

పెన్షన్ పంపిణీ

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలో పంపిణీ చేస్తున్న పెన్షన్ పంపిణీ కేంద్రన్ని నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాలలోని పెన్షన్ లబ్దిదారులకు పోస్టల్ శాఖ సిబ్బంది సహకారంతో పెన్షన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని పెన్షన్ దారులు సకాలంలో పెన్షన్ తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాము మధు, మాజీ ఎంపీటీసీ నల్ల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఎండి శమ్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణా లోపంతో మురికి కాలువల్లో చెత్తాచెదారం నిండి మురికి నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. మండలంలోని చిన్న దేవి సింగ్ తండాలో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుంది. క్రమం తప్పకుండా డ్రయినేజీలను శుభ్రం చేయడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈగలు, దోమల బెడద అధికమై అనారోగ్యం పాలవుతున్నట్లు, అలాగే రో డ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారినట్లు ఆరోపిస్తు న్నారు. అధికారులు పారిశుధ్యంపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డుపై నిలిచిన మురుగు

కళారూపం తిలకించేందుకు తరలిరండి

- దళిత ఐక్య సంఘటన జిల్లా కన్వీనర్ జంగం అశోక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నవభారత నిర్మాత ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ జీవితం ఆశయాల లక్ష్యాలపై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారిచే కళారూపం సంఘం శరణం గచ్చామి ఈనెల 24న ఆర్మూర్ మండలంలోని ఎమ్మార్ గార్డెన్ పెర్కిట్ గ్రామంలో ప్రదర్శించబడుతుందని దళిత ఐక్య సంఘటన జిల్లా కన్వీనర్ జంగమ్మ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళారూపం తిలకించడానికి ప్రజలందరూ తరలిరావాలని ఆయన కోరారు.

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిని కలిసిన మండల నాయకులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటి సారిగా కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్‌ను శనివారం ఇందల్‌వాయి మండల బీజేపీ నాయకులు మెండే అశోక్, లోకాని గోపి, సక్కి శ్రీను ఇంటి వద్ద కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి కనివిని ఎరుగని రీతిలో రాష్ట్రానికి కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని అశాభావం వ్యక్తం చేశారు. బండి సంజయ్ రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని వేములవాడలోని రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్థూపావిష్కరణ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విప్లవోద్యమ నాయకుడు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ స్మారక స్థూపావిష్కరణ కార్యక్రమం పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో డీవీకే నగర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కామ్రేడ్ డివి కృష్ణ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యునిగా, రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యునిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఐఎఫ్‌టియు ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారన్నారు. 50 సంవత్సరాల విప్లవ జీవితమంతా విప్లవోద్యమం నిర్మించటానికి చివరిదాకా కామ్రేడ్ డివి కృష్ణ చేసిన కృషికి గుర్తుగా ఆయన స్మారక స్థూపాన్ని నిర్మించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాగూర్, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.జీ రాంచందర్, కే.రమ, నాయకులు వస్తున్నారన్నారు. జిల్లాలోని కార్మికులు, కర్షకులు, విప్లవ అభిమానులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధానకార్యదర్శి కే.సంధ్యారాణి, పార్టీ పార్టీ నగర నాయకులు విఠల్, సాయిబాబా, అమూల్య, లలిత, వంశీకృష్ణ, గంగాధర్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో చదువుకుంటున్న బాలికల విద్యా బోధన పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలో గల లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి, బోధన్ ప్రతినిధులు నూతనంగా నిర్మించిన వృద్ధాశ్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. పాఠశాల కళాశాలలో బాలికలకు కావలసిన మౌలిక వసతులు సౌకర్యాలు తప్పకుండా ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో మాట్లాడారు. పాఠశాల కళాశాలను సందర్శించాలని ఆమె ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన తప్పకుండా వారం రోజుల్లోపు తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాలను సందర్శించి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్ హందాన్, జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, క్లబ్ ప్రతినిధులు కోడలి కిషోర్ కుమార్, శ్రీనివాస్ రావు, గంగారెడ్డి, మెర్సి న్యావానంది సుభాష్, కొత్తపల్లి శ్రీనివాస్, రాజు, సూర్యనారాయణ, పోల మల్కారెడ్డి, కరటూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగంలో విజయకుమార్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న విజయ్‌కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి దోసారప్ విజయకుమార్‌కు డాక్టర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో " డిజైన్ అఫ్ హైలీ ఎఫిషియంట్ హేతేరోజెనెస్ కాటలీస్ట్స్ ఫర్ ద సెలెక్టివ్ ట్రాన్స్ఫర్మేషన్ అఫ్ బయోమాస్ దేరివేడ్ ప్లాట్ ఫామ్ మోలేకల్స్ టు వాల్యూ అడేడ్ ప్రొడక్ట్స్ ఈ" అనే అంశంపై పరిశోధన జరిపారు. శనివారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ డాక్టర్ వేణుగోపాల్, చీప్ సైంటిస్ట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై విస్తృతమైన ప్రశ్నలు లేవనెత్తారు. పరిశోధకులు అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఈ పరిశోధన సమాజంలోని జీవప దార్థం/బయోమస్ నుండి మనకి అవసరమైన రసాయనాలను, ఇంధనాలను తయారు చేసుకునేందుకు ఎంతగానో పాటుపడుతుందని తెలిపారు. దోసారపు విజయ్ కుమార్ అందించిన జవాబులకు బహిరంగ మౌఖిక పరీక్షకు హాజరైన ప్రొఫెసర్లు సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీ ప్రదానానికి ఆమోదం తెలిపారు. ఈ బహిరంగ మౌఖిక పరీక్షకు ఫార్మసిటికల్ కెమిస్ట్రీ అధిపతి డాక్టర్ వాసన్ చంద్రశేఖర్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్ డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ బోయపాటి శిరీష, కాంటాక్ట్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై రైతులతో కలెక్టర్ ముఖాముఖి

నవతెలంగాణ-నవీపేట్

ధరణి సమస్యలపై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలులో శనివారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సంబంధిత సమస్యలతో దరఖాస్తులు చేసుకున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుకు గల కారణాలను అధికారుల నుండి అడిగి తెలుసుకుని ప్రతి దరఖాస్తును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హత గల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని వాస్తవ నివేదికను ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అర్హులైన న్యాయమైన రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా కృషి చేయాలని అర్హులైన వారికి పట్టా పాస్ బుక్కులు, సక్సేషన్, నాల కన్వర్షన్ వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్, ఆర్డిఓ రాజేంద్ర కుమార్, ఎంపీపీ శ్రీనివాస్, తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, సంబంధిత అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ముఖాముఖిలో పాల్గొన్న కలెక్టర్

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

అనాథ వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, ఎడపల్లి మండలాల ప్రతినిధులు స్వచ్ఛంద సేవలు చేయడానికి ముందుకు రావడం సంతృప్తికరంగా ఉందని బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండల పరిధిలోగల కొత్తపల్లి వీరాజ్, శేష రత్నం మెమోరియల్ లయన్స్ వృద్ధాశ్రమం నిర్మాణానికి సుమారు 30 గుంటల (ఎకరం) వారి తనయుడు కొత్తపల్లి శ్రీనివాస్ లయన్స్ క్లబ్ పెద్దలకు గతంలో అందజేశారు. దాంతో భవనాన్ని పూర్తిగా నిర్మించారు. దీంతో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ దంపతులతో పాటు ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అభినందించారు. ప్రస్తుత రోజుల్లో కన్న తల్లిదండ్రులను తమ బిడ్డలు ఆలనా పాలనా చూసుకోకపోవడంతో చాలామంది వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ఈ ప్రస్తుత పరిస్థితుల్లో అనాథ వృద్ధులకు లయన్స్ క్లబ్ సేవచేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మిని, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, ఎడపల్లి క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

మొక్కలు నాటిన ఎమ్మెల్యే..

ఎమ్మెల్యే ప్రారంభించిన వృద్ధాశ్రమంలో బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మొక్కలను పెంచాలని క్లబ్ ప్రతినిధులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, కోడలి కిషోర్ కుమార్, లయన్స్ క్లబ్ జిల్లా ఆర్గనైజర్ కే సూర్యనారాయణ, కొత్తపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి రాజు, జడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎడపల్లి, జైతపూర్ పిఎసిఎస్ అధ్యక్షులు పోల మల్కా రెడ్డి, కరటూరి సత్యనారాయణ, గాంధీ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల పరీక్ష విధానాన్ని రద్దు చేయాలి

- రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆశాలకు కొత్తగా ప్రవేశపెట్టిన పరీక్ష విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, బిసిజి సర్వేను సైతం రద్దు చేయాలని ఆశావర్కర్స్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు బి స్వప్న డిమాండ్ చేశారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి స్వప్న మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పరీక్ష పెట్టాలని ప్రయత్నం చేస్తే ఆశ కార్యకర్తలు తిరగబడి ఆ ప్రయత్నాన్ని రద్దు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆశా కార్యకర్తలకు ప్రవేశ పరీక్ష పెట్టాలని ప్రయత్నిస్తుందని దీన్ని అడ్డుకుంటామని ఆమె అన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో ప్రయోగాత్మకంగా బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకువస్తున్నారని దీన్ని విరమించుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న పనులు చేయడానికి సమయం, శక్తి సరిపోవటం లేక సతమతమవుతున్నామని, కొత్త కొత్త సంస్కరణలు రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఎగ్జామ్ విధానాన్ని, బీసీజీ సర్వే విధానాన్ని అమలు చేయాలని ఆశా కార్యకర్తలను ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఆశా కార్యకర్తలు గత 19 ఏళ్ళుగా గ్రామాల్లో బస్తీల్లో బీపీ, షుగర్, థైరాయిడ్ మాతా శిశు సంరక్షణ, కరోనా వంటి విపత్కర అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ప్రజలకు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ వీరిని హెల్త్ గ్లోబల్ లీడర్‌గా గుర్తించిందని, అలాంటి స్కిల్ ఉన్న ఆశా కార్యకర్తలకు మళ్లీ నూతన ప్రవేశ పరీక్ష విధానాన్ని తీసుకురావడం శోచనీయమన్నారు. ఈ ప్రవేశ పరీక్ష పెట్టడం వల్ల ఆశా కార్యకర్తల్లో భయాందోళనలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉద్యోగులను తొలగించే విధంగా ఈ పద్ధతి తీసుకువచ్చారని, ఈ ఎగ్జామ్ వల్ల వీరికి ప్రమోషన్స్, ఏఎన్ఎం వెయిటేజ్ ఇచ్చే పరిస్థితి లేదని వివరించారు. అలాంటి విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే 24న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఇందల్వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ఉన్న ఆశాలు ఈ ధర్నాకు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు బండ ప్రమీల, ఎం.నిర్మల, బి.గంగాలక్ష్మీ, ఎస్.సరిత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగాభవానీ రథోత్సవం

- ప్రత్యేక పూజలు చేసిన ఎంపీపీ నల్ల సారిక



రథోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ నల్ల సారిక

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సత్యగంగా పౌర్ణమి వేడుకల సందర్భంగా గంగాభవానీ రథోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రథాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టి.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము ఆలయ ఆవరణలో జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

సీబీఎస్ఈలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-మోపాల్

సీబీఎస్ఈలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని పలువురు అభినందించారు. మండల కేంద్రంలోని ప్రెసిడెన్సీ పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం పాఠశాలకు చెందిన విద్యార్థి పి.విరాజ్‌ను సిబిఎస్ఈలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పాఠశాల చైర్‌పర్సన్ నల్ల శమంతరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి 500/480 మార్కులు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల అరెస్టు పట్ల ఖండన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని ఎన్టీఏపై చర్యలు తీసుకోవాలని అన్ని విద్యార్థి సంఘాల ఐక్యంగా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఇంటి ముట్టడి కార్యక్రమంలో భాగంగా వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం వారిని పోలీస్ స్టేషన్లో బంధించడాన్ని నిరసిస్తూ సిపిఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్, పిడిఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ శనివారం ఖండించారు. ఈ సందర్భంగా వారు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని విద్యార్థి నాయకులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 24లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఆ పరిస్థితిని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపబోతే ఎంపీ అరవింద్ పోలీసులతో దౌర్జన్యంగా లాఠీచార్జ్ చేయించి, వారిని అక్రమంగా అరెస్టు చేసి మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. ఈ నీట్ పరీక్ష విషయంలో మోడీ స్పందించాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, కార్యదర్శి కర్కా గణేష్, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు నజీర్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఒకే దఫా రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

ఒకే దఫా రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి తెలిపారు. రుణమాఫీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సందర్భంగా శనివారం మండల కేంద్రంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద మొత్తంలో బాణసంచాలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కర్షక ప్రభుత్వమని అన్నారు. రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తుందని, అందులోనే భాగంగా ఒకేసారి ఏక మొత్తంలో 31 వేల కోట్లతో నలభై ఏడు లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయనుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేదే చేస్తుందని చేసేదే చెప్తుందన్నారు. సోనియా గాంధీ పుట్టిన రోజైనా డిసెంబర్ 9న రుణమాఫీ కట్ ఆఫ్ తేదీగా ప్రకటించిందని తెలిపారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించాడని దానికి అనుగుణంగా ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా రుణమాఫీ చేస్తున్నామన్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏకకాలంలో లక్ష రుణమాఫీ చేశామని.. దానికనుగుణంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకేదఫా రూ.2లక్షలు రుణమాఫీ చేస్తున్నాడని ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల్లోనే రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని చెప్పారు. రైతు భరోసా విషయంలో కూడా రైతులకు ఎటువంటి సందేహం లేదని కచ్చితంగా రైతు భరోసా డబ్బులు అతి తొందరలో రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సోనియా గాంధీకి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డి, లింగన్న, సతీష్ రావు, సాయికుమార్, సురేష్ నాయక్, రాజేష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్ప గంగారెడ్డి

టీయూ గర్ల్స్ హాస్టల్ ఘటనపై చర్యలు చేపట్టాలి

- పిడిఎస్‌యూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ యూనివర్సిటీ గర్ల్స్ ఘటనపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో గర్ల్స్ హాస్టల్‌లో భోజనంలో బల్లి రావటం అంటే విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటమేనని తెలిపారు. ప్రతిరోజు వార్డెన్ నిత్యం అందుబాటులో ఉండాలని, వీసీ యూనివర్సిటీ సందర్శించాలని, ఈ ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు కార్తీక్, ప్రిన్స్, సాయినాథ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఎర్గట్ల



రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడంతో, ఏర్గట్ల కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఇది రైతు ప్రభుత్వం అని, రైతుల కోసం రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్, పన్నాల నర్సారెడ్డి, కురాకుల బొర్రన్న, ఇంద్రాసేనా రెడ్డి, దండేవోయిన సాయికుమార్, రొక్కెడ చిన్నసాయన్న, బద్దం జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలపడేందుకే

'మహిళా శక్తి'



శిక్షణకు హాజరైన అధికారులు

- డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్
- తెలంగాణ రాష్ట్రం-మహిళ శక్తి కార్యక్రమంపై జిల్లా స్థాయిలో శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడేందుకే ప్రభుత్వం 'మహిళాశక్తి' కార్యక్రమాన్ని అమలు చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్ అన్నారు. శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిజామాబాద్ జిల్లాలోని అన్ని మండలాల సిబ్బంది, టి-సెర్ప్ డిఆర్‌డిఎ ద్వారా నిర్వహిస్తున్న మహిళాశక్తి కార్యక్రమ మార్గదర్శకాలు, వివిధ కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని మండల కేంద్రంలోని ట్రైజం సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ సాయగౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడానికే "మహిళాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాట్లు తెలిపారు. వడ్డీ వ్యాపారులు, మైక్రోఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి మహిళలకు విముక్తి కల్పించి మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి, ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ రకాల బిజినెస్ మోడళ్ళను సూచించారు. మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్, బస్టాండ్, ఆసుపత్రులు జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో ఏర్పాట్లకు అనువైన ప్రదేశాలలో మహిళా సంఘం సభ్యులతో నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 37 మీ సేవా కేంద్రాలు, ఆధార్ అప్‌డేట్స్, మొబైల్‌కు లింక్ తదితర అవసరాలకు మీసేవా కేంద్రాల నిర్వహణ కూడా మహిళలకు అప్పగించినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ సాయాగౌడ్

మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో, మండలస్థాయిలో, జిల్లా స్థాయిలో నిర్వహించే వివిధ రకాల సమావేశాలకు, ఇళ్లలో జరిగే శుభకార్యాలు, అశుభకార్యాలు నిర్వహణ ఈవెంట్ మేనేజ్‌మెంట్ మహిళలు ఆర్థికాభివృద్ధి సాంధించవచ్చని వివరించారు. ఇవే కాకుండా సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటు, నిర్వహణ ద్వారా పౌల్ట్రీ వ్యాపారాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. జులై 1 నుంచి 31 వరకు మహిళాశక్తి మాసోత్సవాన్ని అందరం కలిసి చివరి నాటికి వీవోఏల జనరల్ బాడీల నిర్వహణ, ఎంఎస్ జనరల్ బాడీల నిర్వహణ, బ్యాంకు లింకేజ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. సోషల్ మోబైలిజేషన్‌లో భాగంగా ఎస్‌హెచ్‌జిలలో పదిమంది సభ్యుల కన్నా తక్కువ ఉన్న సంఘాలలో కొత్త వారితో భర్తీ చేయడం, నూతన ఎస్‌హెచ్‌జిఓల ఏర్పాటు కూడా చేయాలని పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన, సక్రమంగా నిర్వహించగల సామర్థ్యం కలిగిన మహిళా సభ్యులను గుర్తించి గ్రౌండింగ్ చేయడం ద్వారా ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి మహళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. రాబోయే 5 సంవత్సరాలలో ఒక లక్ష కోట్లను ఎస్‌హెచ్‌జికు లింక్ చేయాలని వివరించారు. ఇందులో 25 వేల కోట్లు వ్యాపారాభివృద్ధి కోసం వినియోగించుకోవాలని, మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయాలని, సంఘాలలో లేని మహిళలను సంఘాలలో చేర్పించాలని, విఎల్‌ఆర్ గుర్తించాలని, ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి 2 లక్షల బీమా సౌకర్యం (స్త్రీనిధి), ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ప్రమాదవశాత్తు బీమా 10 లక్షలు కల్పించాలని సూచించారు.

వ్యాపారానికి సంబంధించి నైపుణ్యాలను, మార్కెటింగ్, బ్రాండింగ్ డెవలప్‌చేయడానికి, అమ్మ ఆదర్శ పాఠశాలలో వి.ఓ ప్రెసిడెంట్ ద్వారా స్కూల్ బిల్డింగ్ రిపేర్లు చేయించడం, మౌళిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేయించడం, స్కూల్ యూనిఫామ్స్, అంగన్వాడి పిల్లల యూనిఫామ్స్, ఇతర ప్రైవేట్ కంపెనీల ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల యూనిఫామ్స్‌ను స్వయం సహాయక సంఘం మహిళల ద్వారా కుట్టించడం, డ్వాక్రా బజార్లు ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం, మీసేవా సెంటర్లు (బ్యాంకింగ్ జనరల్ లావాదేవీలు, ఎస్‌హెచ్‌జి ఆర్థిక లావాదేవీలు), జిల్లాకు ఒక క్యాంటీన్ (ప్రభుత్వ ఆసుపత్రి) మహిళలచే నిర్వహించడం, ఫుడ్ సెక్టార్/ నాన్ ఫాం సెక్టార్‌లో మహిళలను మొత్తం 11 లక్షల మందిని మహిళా శక్తి పరిధిలోకి తీసుకురావాలని, సర్వీస్ సెక్టార్‌లలో బ్యాంకు మిత్ర, పశుమిత్ర, కృషి మిత్రలను గుర్తించి శిక్షణ ఇచ్చి సంబంధిత రంగాలను నిర్వహించేలా చేయడం జరుగుతుందని పిడి సాయగౌడ్ వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్‌డిఓ రవీందర్, డిపిఎం ఫైనాన్స్ ఎ.శ్రీనివాస్, సంధ్యారాణి, సాయిలు, నీలిమా, రాచయ్య, మారుతి, అన్ని మండలాల ఎపిఎంలు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో దిద్దుబాటు చర్యలు

- హెడ్ కుక్ రాజేశ్‌ను విధుల నుంచి తొలగింపు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో శుక్రవారం ఉదయం అల్పాహారంలో కీటకం కళేభారాన్ని గుర్తించిన విషయం బాలికల కేర్‌టేకర్ దృష్టికి రాగానే అల్పాహారాన్ని పడవేసి మిగిలిన వారికి తాజాగా వంట చేసి విద్యార్థులకు అందించినట్లు తెలంగాణ యూనివర్సిటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీఫ్ వార్డెన్ ఆదేశాల మేరకు హాస్టల్ కేర్ టేకర్, హాస్టల్ వార్డెన్ విచారణ నిర్వహించి రిజిస్ట్రార్‌కు నివేదికను అందించారని, వైస్ ఛాన్సలర్ ఆదేశానుసారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి హెడ్ కుక్ రాజేష్‌ను సస్పెండ్ చేసి, విధుల నుంచి తొలగించారని వివరించారు. మిగిలిన సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కిచెన్ గదిలో పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని లేనిపక్షంలో కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. హాస్టల్ కేర్ టేకర్, వార్డెన్, హాస్టల్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

గతంలో స్పందించి ఉంటే..

గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారులు మేల్కొని ఉంటే ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమయ్యేవి కావని కొందరి నిర్లక్ష్యం ఫలితం విద్యార్థుల జీవితాలతో చెలగాటమేనని పలువురు విద్యార్థులు విలేకరులతో పేర్కొంటూ వాపోయారు. ఇప్పుడు అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారని, ఇది ఎన్ని రోజులపాటు కొనసాగుతుందోనని పలువురు పేర్కొన్నారు.

నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలి

- పివైఎల్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

భవిష్యత్తు తరాల ప్రజలకు వైద్యం అందించే వైద్య విద్యార్థిని విద్యార్థులకు నీట్ పరీక్ష పేపర్‌ని 30 లక్షలకు అమ్మడం దుర్మార్గమైన చర్య అని, ఇటువంటి వాళ్లపై తక్షణమే కఠినమైన చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిని ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) మాజీ రాష్ట్ర అధ్యక్షులు దేశెట్టి సాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బోర్గం (కే) గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదంతా జరిగినా భారత ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మోడీ జోక్యం చేసుకొని నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ పరీక్షను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థి యువజన సంఘాలు పిలుపుమేరకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇల్లు ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తే, విద్యార్థి యువజన సంఘాల నాయకులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, విద్యార్థి యువజన సంఘాల నాయకులపై లాఠీచార్జి చేసిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విద్యార్థి యువజన సంఘాల నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్రాన్ని మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సహకరిస్తాం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర ఇందూర్ న్యూరో సైకియాట్రిక్ ఆసుపత్రి డాక్టర్ విశాల్ డి అడిక్షన్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పదవ వార్షిక తెలంగాణ రాష్ట్ర సైకియాట్రిక్ మహాసభలను శనివారం మండలంలోని బర్దిపూర్ శివారులోని కృష్ణ హొటల్లో నిర్వహించారు. ఈ మహాసభలు మూడు రోజుల పాటు కోనసాగనున్నాయి. రెండవ రోజు శనివారం ముఖ్య ఘట్టం మహాసభల ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీకాంత్రాటి, గౌరవ అతిథులుగా ఎమ్మెల్సీ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులందరూ కలిసి మత్తు పదార్థాలు దాని చికిత్స విధానంపై అవగాహన కల్పించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్



సరస్వతిని సన్మానిస్తున్న పలువురు

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తున్న పట్వారి గోపికృష్ణ, పట్వారి తులసి వారి మాతృమూర్తి బాల సరస్వతిని రామ్‌నగర్ పద్మశాలి సంఘం ఐదవ తర్ప ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సమాజ సేవను అందించే కుమారులను జన్మనిచ్చిన మాతృమూర్తిని గౌరవించుకోవాలనే ఉద్దేశంతో వారిని సన్మానించామని అధ్యక్షులు సైబర్ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ సేవలు చేస్తున్న పట్వారి గోపికృష్ణను కార్యదర్శిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కొండ గంగాధర్, కోశాధికారి కేతన్, లక్ష్మణ్, ఆడే ప్రభాకర్, నరేందర్, గుద్దేటి రమేష్, సుధాకర్, గణేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో బోర్గం గంగాధర్‌కు చెందిన కిరాణా, బ్యాంగిల్ స్టోర్‌లో దొంగతనం జరగడంతో బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు తన కిరాణా షాపు తాళం పగలగొట్టి కౌంటర్‌లో గల 8500 రూపాయల నగదుతో పాటు, ఇతర వస్తువులను దొంగిలించుకుపోయినట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 20 వేల రూపాయల నష్టం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- జయప్రదం చేయండి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై జూన్ 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. సిఐటి యు జిల్లా కార్యాలయంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ బకాయి వేతనాల సమస్యలపైన ఈనెల 26న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా ఉంటుందని వివరించారు. గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలైన బకాయి వేతనాలు నిజామాబాదు జిల్లాలో 5 నుంచి 6 నెలలు, మరి కొన్ని జిల్లాలో 8 నుంచి 10 నెలల వరకు ఉన్నటు వంటి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చెయ్యాలన్నారు. జీవో నెంబర్ 51ను సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ఆలోపు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించి సహయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. పంచాయతీ సిబ్బందికి 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని అమలు చేయాలని, పంచాయతీ సిబ్బందికి దహన ఖర్చులకు రూ.10,000ల నుండి 20,000లకు పెంచాలని, విధి నిర్వహణలో చనిపోయిన పంచాయతీ సిబ్బందికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేష్, జంగం గంగాధర్, సాయిలు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

విద్యార్థుల తల్లిదండ్రుల సూచన మేరకే

పుస్తకాలు, సామగ్రి విక్రయం

- విద్యార్థి సంఘాలు సహకరించాలి
- ట్రస్మా రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సేపూర్ జయసింహగౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ప్రతి తల్లిదండ్రి కొనుక్కోవాలంటే కొన్ని రోజుల కేటాయించి మార్కెట్‌లో తిరగాల్సి వచ్చేదని, అన్ని వస్తువులు పూర్తిగా దొరకడం కష్టంగా ఉంటుందని తల్లిదండ్రుల కోరిక మేరకే పాఠశాలలో వారి సౌకర్యార్థం పాఠ్య పుస్తకాలు, ఇతర సామగ్రిని ఒకే చోట అందించడం కోసం లాభ పేక్ష లేకుండా తెప్పించి పంపిణీ చేస్తున్నట్టు ట్రస్మా రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సేపూర్ జయసింహ గౌడ్ తెలిపారు. అయితే ఈ విషయంలో విద్యార్థి సంఘాలు తప్పుపడుతూ పాఠశాల యాజమాన్యాలు వ్యాపార దృక్పథంతో ఈ పని చేస్తున్నారని ఆరోపిస్తూ, పలు విధాలుగా పాఠశాల నిర్వహణలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ పాఠశాల నిర్వహణని అడ్డుకోవడం అనేది సరైన విధానం కాదని వివరించారు. శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో సుమారు 30 మంది పాఠశాల నిర్వాహకులు జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి విద్యార్థి సంఘాల తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణకు సహకరించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ట్రస్మా రాష్ట్ర స్పోక్స్ పర్సన్ సేపూర్ జయసింహ గౌడ్ మాట్లాడుతూ..

కొంతమంది వ్యక్తులు సంఘాల పేరు చెప్పుకొని బలవంతపు వసూళ్లు, చిన్న పాఠశాలలకి ఎంతో ఇబ్బందికరంగా మారిందని, బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లలో స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయని వారి జీతభత్యాలు కూడా సరిగా అందినటువంటి పరిస్థితుల్లో పాఠశాల నిర్వహణ కొనసాగిస్తున్నారనే విషయాన్ని తెలుసుకుని సహకరించాలని ఆయన కోరారు. ఇలాంటి ఒత్తిళ్ల వల్ల మానసికంగా వేదన పడుతూ చాలామంది పాఠశాల నిర్వాహకులు అప్పుల పాలవుతున్నారని ఆయన తెలియజేశారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రయివేటు స్కూల్ నిర్వాహకులు

కేవలం తల్లిదండ్రుల విద్యార్థుల సౌకర్యం కోసం వేసిన ఈ సౌకర్యాన్ని తప్పుపట్టి దాడులు చేయడం అమానుషమని అన్నారు. విద్యార్థి సంఘాలలో పనిచేస్తున్న యువకులు కూడా విద్యార్థులే కావడం వల్ల వారి మీద ఎలాంటి చర్య తీసుకున్నా వారి భవిష్యత్తు పాడవుతుందనే ఉద్దేశంతో సామరస్యంతో మెలుగుతున్నటువంటి పాఠశాల యాజమాన్యాలన్నీ మరింత ఇబ్బంది పెట్టినట్టయితే భవిష్యత్తులో వారు కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం. అనంతరం ట్రస్మా నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నిత్యానంద్ మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాలు, పాఠశాల యాజమాన్యాలు, కలిసి పనిచేసినట్లయితే మంచి విద్యను తెలంగాణ ప్రాంత పిల్లలకు ఇవ్వడానికి వీలవుతుందని, తాము ఇస్తున్న సౌకర్యాలను వ్యాపార దృక్పథంతో కాకుండా వారికి సౌకర్యం కోసం ఏర్పాటు చేసినవిగా భావించి విద్యార్థి సంఘాలు సహకరించినట్లయితే ఇరువురికి సమంజసంగా ఉండి మన తెలంగాణ విద్యార్థులు ఉన్నత విలువలతో కూడిన మంచి విద్యను అందుకోవడానికి వీలవుతుందని అన్నారు. విద్యార్థి సంఘాల సూచనలను, వారి సలహాలని తప్పకుండా తాము ఆదరిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోజూరి అరుణ్, పట్టణ అధ్యక్షులు ధర్మరాజు, కోశాధికారి నాగరాజు, మోహన్, వివిధ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించిన జడ్పీ సీఈవో

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను జిల్లా పరిషత్ సీఈవో ఉష శనివారం సాయంత్రం పరిశీలించారు. పాఠశాలల్లో ప్రారంభమైన సందర్భంగా పనులను వేగవంతం చేయాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓకు సన్మానం..

మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు రజిని కిషోర్ జడ్పీ సీఈవో ఉషాకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె మొదటిసారిగా తమ మండల కార్యాలయాన్ని సందర్శించిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్లు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో